

ఫతేషాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరి

# గ్రామాల అభివృద్ధే ధ్యేయం

- ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని ప్రగతిపథంలో ముందుంచుతా
- అవినీతి కాంగ్రెస్, మతోన్మాద బీజేపీకి గుణపాఠం చెప్పాలి
- బీఆర్‌ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరి

రఘునాథపల్లి నవంబర్ 3 : ప్రజలు ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపిస్తే గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తానని బీఆర్‌ఎస్ స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. రఘునాథపల్లి మండలం పత్తేషాపూర్, ఇబ్రహీంపూర్, లక్ష్మీతండా, రామచంద్రగూడెం, మాధారం, దాసన్నగూడెం సోమయ్యకుంటతండా, ఖిలాషాపురంలో శుక్రవారం నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తనను స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంపిక చేశారని, ప్రజలు ఆశీర్వాదించి గెలిపిస్తే ఎమ్మెల్యేగా సేవలందిస్తానని అన్నారు. గతంలో మంత్రి, డిప్యూటీ సీఎంగా ప్రజా సేవ చేశానని గుర్తు చేశారు. అవినీతికి తావులేకుండా నిజాయితీగా ప్రజలకు సేవలందించానని, గ్రామాల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేశానని శ్రీహరి వివరించారు. దేశంలో ఎక్కడాలేని విధంగా సీఎం కేసీఆర్ తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. వ్యవసాయాన్ని పండుగలా మార్చడంతోపాటు నిరంతరం ఉచిత విద్యుత్ ఇస్తున్నారని, రైతుబంధు, రైతు బీమా పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. నాడు రఘునాథపల్లి, లింగాలఘనపురం మండలాలు జనగామ నియోజకవర్గంలో ఉండేవని, నేడు స్టేషన్‌ఘన్‌పూర్‌లో నియోజకవర్గంలో ఉన్నందున అభివృద్ధి చేసే అవకాశం తనకు లభించిందన్నారు. ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతోపాటు సీసీ రోడ్లు, అంతర్గ లింక్‌రోడ్లను ఆరు నెలల్లోనే వేయిస్తానని అన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. అవినీతి కాంగ్రెస్, మతతత్వ బీజేపీకి ఈ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పాలని కోరారు. కారు గుర్తుకు ఓటేసి బీఆర్‌ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కడియం శ్రీహరి కోరారు.

**ఘన స్వాగతం పలికిన ప్రజలు**

బీఆర్‌ఎస్ ఆత్మీయ సమావేశాలకు హాజరైన ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరికి ఆయా గ్రామాల ప్రజలు నీరాజనం పలికారు. ఈ సందర్భంగా బతుకమ్మలు, బోనాలతో మహిళలు రాగా, కళాకారులు డప్పు చప్పుళ్లు, కోలాటాలతో ర్యాలీ నిర్వహించారు. గులాబీ శ్రేణులు కడియం శ్రీహరికి అపూర్వ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ బొల్లం అజయ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు వారాల రమేశ్‌యాదవ్, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు మారుజోడు రాంబాబు, జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ముసిపట్ల విజయ్, నాయకులు మల్కపురం లక్ష్మయ్య, నామాల బుచ్చయ్య, వై కుమార్‌గౌడ్, దొనికెల రమాదేవి, మడ్లపల్లి సునీత, దొరగొల్ల యాదగిరి, కావటి రాజయ్య పాల్గొన్నారు.



ఇబ్రహీంపూర్‌లో డప్పుచప్పుళ్లతో ర్యాలీగా వస్తున్న ప్రజలు



గుడికుంట తండాలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



నారబోయినగూడెంలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

# గిరిజనుల మధ్య చిచ్చుపెడుతున్న కాంగ్రెస్

- ఎస్టీలను వర్గీకరిస్తామంటున్న రేవంత్‌రెడ్డి ఓ రాజకీయ బ్రోకర్
- వ్యవసాయానికి మూడు గంటలు కరెంట్ చాలన్నందుకు బుద్ధి చెప్పాలి
- పజా సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయం
- బీఆర్‌ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి
- పాలకుర్తి నియోజకవర్గ అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి రూరల్, నవంబర్ 3: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎస్టీ వర్గీకరణ చేపడుతామంటున్న టీ-పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి గిరిజనుల మధ్య చిచ్చు పెడుతున్నాడని బీఆర్‌ఎస్ పాలకుర్తి నియోజకవర్గ అభ్యర్థి, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బ్రోకర్‌గా మారిన రేవంత్‌రెడ్డికి ఈ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం పాలకుర్తి మండల దుబ్బతండా(ఎస్పీ), గుడికుంట తండా, గోపాలపురం, నారబోయిన గూడెం గ్రామాల్లో ప్రర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లికి గిరిజనులు సంప్రదాయ రీతిలో బతుకమ్మలు, బోనాలతో ఘన స్వాగతం పలికారు. డప్పుచప్పుళ్లతో నృత్యాలు చేస్తూ నీరాజనం పలికారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ రాష్ట్రంలోని మారుమూల పల్లెలు, తండాలను గ్రామపంచాయతీలుగా మార్చి అభివృద్ధి పనులకు పెద్ద ఎత్తున కేటాయిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలకు నిధులు మంజూరు చేశారని ఆయన గుర్తు చేశారు. గిరిజన బిడ్డలకు ప్రజాప్రతినిధులుగా అవకాశం కల్పించామని, వారి కోరిక మేరకు మరిన్ని తండాలను పంచాయతీలుగా గుర్తించామన్నారు. గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తున్నదని, వీరికి 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నదే సీఎం కేసీఆర్ లక్ష్యమన్నారు. ఈ మేరకు అసెంబ్లీలో గిరిజన రిజర్వేషన్ల బిల్లును ఆమోదించి కేంద్రానికి పంపినా అమలు చేయడంలో ప్రధాని మోదీ విఫలమయ్యారని ఎర్రబెల్లి విమర్శించారు. తండాల్లో సాగు, తాగు నీరు, కనీస సౌకర్యాలు కల్పించేందుకు నిధులు మంజూరు చేస్తున్న విషయాన్ని వెల్లడించారు. తండాలకు, ఆవాస ప్రాంతాలకు బీటీ రోడ్డు సౌకర్యం కల్పించామన్నారు. గోదావరి జలాలతో చెరువులు, కుంటలు నింపానన్నారు. మిషన్ భగీరథ ద్వారా తండాల్లో ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నామన్నారు. పాలకుర్తి మండల కేంద్రంలో సేవాలాల్ మహరాజ్ గుడికి రూ.10 కోట్లు మంజూరు చేశామని ఆయన గుర్తు చేశారు. ఆసరా పథకంలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు పింఛన్ అందిస్తున్నామన్నారు. అభివృద్ధిని ఓర్వలేని కాంగ్రెస్, మతతత్వ బీజేపీకి ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని ఎర్రబెల్లి ప్రజలకు పిలుపునిచ్చారు.

**నూతన జీపీ భవన నిర్మాణాలకు నిధులు..**

గ్రామపంచాయతీలుగా మారిన తండాల్లో నూతన జీపీ భవనాలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని మంత్రి ఎర్రబెల్లి తెలిపారు. గ్రామాలతోపాటు తండాల్లోనూ నర్సరీలు, వైకుంఠధామాలు, క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశామన్నారు. 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో గిరిజనులను పట్టించుకోలేదని విమర్శించారు. ఎన్నికల్లో ఓట్ల కోసం వచ్చే వారిని పట్టించుకోవద్దని సూచించారు. ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు ద్వారా ఉపాధి హామీ కూలీలకు ఉచితంగా బ్యాగులను అందిస్తున్నానని చెప్పారు. సీఎం కేసీఆర్‌కు గిరిజనులు అండగా నిలబడాలని ఆయన కోరారు. వ్యవసాయానికి మూడు గంటల విద్యుత్ చాలంటున్న కాంగ్రెస్ నేతలకు గుణపాఠం చెప్పాలని, నిరంతర విద్యుత్ ఇస్తున్న బీఆర్‌ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని దయాకర్‌రావు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, జడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాస్‌రావు, రైతుబంధు సమితి మండల కన్వీనర్ వీరమనేని యాకాంతారావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు ఎర్రబెల్లి రాఘవరావు, ముస్కు రాంబాబు, యూత్ ఇన్‌చార్జి ఎర్రబెల్లి వినయ్‌రావు, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మాచర్ల ఎల్లయ్య, సర్పంచ్‌లు బానోత్ యాకూబ్, కాంతి, మేడిద రజిత, చెరిపెల్లి రజిత అనిల్, కోస రాంరెడ్డి, గ్రామశాఖ అధ్యక్షులు రమేశ్, భోజ్యా, మూర్తి, గంగమ్మ, బానోత్ శంకర్, ఠాకూర్, దేవేందర్, హనుమంతు, వీరన్న, మోహన్, జైతురాం, బానోత్ వెంకటి, రాములు, బానోత్ రమేశ్, చిక్కుడు సమ్మయ్య, రాంరెడ్డి పాల్గొన్నారు.

# తొలి రోజు రెండు నామినేషన్లు

- స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి అసెంబ్లీ స్థానాలకు ఒక్కొక్కటి దాఖలు
- జనగామ స్థానానికి నామినేషన్లు నిల్
- రిటర్నింగ్ ఆఫీసర్ల కార్యాలయాల వద్ద పోలీస్ బందోబస్తు




జనగామ ఆర్డీవో కార్యాలయంలో హెల్ప్‌డెస్క్‌లో అధికారులు

జనగామ, నమస్తే తెలంగాణ/ పాలకుర్తి రూరల్, నవంబర్ 3 : అసెంబ్లీ ఎన్నికల్లో కీలక అంకమైన నామినేషన్ల పర్వం మొదలైంది. జిల్లాలోని మూడు సెగ్మెంట్లలో తొలి రోజు శుక్రవారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. జనగామ నియోజకవర్గంలో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. స్టేషన్‌ఘన్‌పూర్ అసెంబ్లీ స్థానం నుంచి బొల్లెపాక రాజేశ్ (స్వతంత్ర), పాలకుర్తి నుంచి మందయాకమల్లు (స్వతంత్ర) ఒక్కో సెట్ చొప్పున నామినేషన్ పత్రాలను ఆయా రిటర్నింగ్ అధికారులకు అందజేశారు. ఈనెల 3 నుంచి 10వ తేదీ వరకు ఆదివారం సెలవు మినహా మిగిలిన రోజుల్లో అభ్యర్థుల నుంచి ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 13వ తేదీన నామినేషన్ల పరిశీలన, 15న ఉపసంహరణ ఉంటుందని అధికారులు తెలిపారు. ఆదేరోజు ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల తుది జాబితా వెల్లడించి, ఎవరెవరికీ ఏ గుర్తులు కేటాయించారన్నది బహిరంగ పరుస్తారు. మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎక్కడిక్కడే నామినేషన్ల స్వీకరణకు వీలుగా కేంద్రాలు ఏర్పాటు చేశారు. జనగామ అసెంబ్లీ సెగ్మెంట్ నామినేషన్లు స్థానిక ఆర్డీవో కార్యాలయంలో, స్టేషన్‌ఘన్‌పూర్ సెగ్మెంట్ నామినేషన్ల అక్కడి తహసీల్ కార్యాలయంలో, పాలకుర్తి సెగ్మెంట్ నామినేషన్లను అక్కడి తహసీల్ కార్యాలయంలో స్వీకరిస్తున్నారు.



జనగామ ఆర్డీవో కార్యాలయం వద్ద పోలీసు, పారామిలటరీ బందోబస్తు

## జిల్లా సరిహద్దు చెక్ పోస్టుల తనిఖీ

జనగామ, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల ఘట్టం మొదలైన నేపథ్యంలో శుక్రవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సీహెచ్. శివలింగయ్య జిల్లా ప్రారంభ సరిహద్దులోని పెంబర్తి, జీడికల్లు క్రాస్ రోడ్డు చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికలు-2023 సందర్భంగా జిల్లాలో సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లాకు కేంద్ర బలగాలు వచ్చాయని, అక్రమ మద్యం, డబ్బు తదితర వస్తువులు రవాణా చేయకుండా పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని, ప్రతి వాహనాన్ని పరిశీలించిన తర్వాత వదలాలని సూచించారు. చెక్ పోస్టులలో విడుతల వారీగా సిబ్బంది 24 గంటలు విధులు నిర్వహించాలని రిజిస్టర్లు, రికార్డులు పక్కాగా నిర్వహించాలన్నారు. ఇప్పటివరకు తనిఖీ చేసి సీజింగ్ చేసిన వస్తువులు, డబ్బు తదితర అంశాలపై సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎన్నికల నోడల్ అధికారులు డీఎంవో నరేందర్‌రెడ్డి, డీఆర్‌డీవో ప్రాజెక్ట్ డైరెక్టర్ మొగులప్ప ఉన్నారు.



పెంబర్తి చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న శివలింగయ్య